# నందనవనం - 20

భద్రయ్య ఉత్సాహంగా సతీమణిని పిలిచి... కూతురితో శ్రీవల్లికి తాంబూలం ఇప్పించమని పురమాయించాడు. లోపలకు వెళ్ళి ఓ రెండు నిముషాలుండి మళ్ళీ వచ్చి కూర్చున్నాడు.

భద్రయ్య భార్య భగవతి, కూతురుని వెంటబెట్టుకు వచ్చింది.

''మీ గురించి విని... తల్లీ కూతుళ్ళిద్దరూ మిమ్మల్ని చూడాలని ఒకటే ఆరాటపడ్డారు. ఆవిడేమీ పెద్ద భవంతిలో ఎవరికీ కనిపించకుండా తలుపులు మూసుకుని కూర్చోవటం లేదుగా, వెళ్ళి చూసిరండని ఎన్నోసార్లు చెప్పినా... ఏమిటో వీళ్ళకు మొహమాటం!

సరే, నేనే ఓసారి పిలిచి పరిచయం చేస్తానని మాట ఇచ్చాను! అయితే పనులమీద అటూ ఇటూ తిరుగుతూ ఆ మాటా మర్చిపోయాను... తీరికా లేక పూజ సంగతి చెప్పి మిమ్మల్ని పిలవాలనే కోరిక చెప్పేసరికి... ఆడవాళ్ళు కాకుండా నేనే వస్తే ఏమనుకుంటారోనని సందేహం కలిగిందిగానీ కొంచెం పరిచయం నాకైతే ఉందికదాని నేనే వచ్చాను! ఇద్దర్నీ రమ్మనాలనుకున్నా గానీ... ఆరోజు మీ ఇద్దరి వాదనా విని... మీ మధ్య సయోధ్య లేనపుడు... ఇబ్బంది పెట్టటం ఎందుకని మిమ్మల్ని మాత్రమే పిలిచి వూరుకున్నాను! ఏ చిన్న విషయంలోనైనా వ్యతిరేకత వస్తే నేను చాలా బాధపడిపోతుంటాను... అది నా నైజం! అరె, ఎందుకడిగానా అని మథనపడటం కంటే... అసలు అడగకుండా వూరుకోవటమే ఉత్తమం కదా అనుకుంటాను! అందుకే

సుబ్బయ్యను రమ్మని పిలవలేకపోయాను! ఇదిగో... ఇపుడు మీతో ఇలా మనసారా మాట్లాడాకనే కదూ మీ గురించి నాకు బాగా తెలిసిందీ...!''

భద్రయ్య మాటల అంతరార్థం ఏమై ఉంటుందా అని శ్రీవల్లి ఓ క్షణం ఆలోచించింది. భోజనానికి పిలవటానికే ఇంత తర్జన భర్జన పడటం కొంచెం ఆశ్చర్యమే కలిగించింది! భోజనాల తర్వాత అసలు విషయం ఆమెకు అవగతమైంది! తనకి తెలివిగా ముందరి కాళ్ళకు బంధాలేసినట్లుగా... అప్పుడు గుర్తించగలిగింది!

భోజనాల దగ్గిర చేసిన పదిరకాల పిండి వంటల్నీ చూసి శ్రీవల్లి ఇన్ని ఎందుకు చేసారంటూ మొహమాటపడితే, భద్రయ్యగారి భార్య భగవతి అతని వైపు చూసి బదులు చెప్పకుండా మిన్నకుండిపోయింది.

భద్రయ్యే సమాధానం చెప్పాడు.

''బావుందమ్మా... ఏది మీ కిష్టమో తెలియక, మాకు చేతనైన రకాలు చేస్తే... ఏదో ఒకటి రెండయినా మీకు ఇష్టమైనవి ఉంటాయనే అభిప్రాయంతో వండించా' అభిమానం అనేది మనసులో ఉంటే సరిపోతుందని కొందరంటారు గానీ... ఆ మాట నాకు మాత్రం నచ్చదమ్మా. మన ఇంటికి పిలిచిన వ్యక్తిని బట్టి గౌరవమర్యాదలూ ఉండాలని నా అభిప్రాయం...!''

ఆ ఘనమైన ఏర్పట్లన్నీ తన గొప్పతనాన్ని గుర్తించటం వలనే చేసినవని చెప్పకనే చెప్పినట్లుగా శ్రీవల్లికి అనిపించింది.

ఖరీదైన చీరె, జాకెట్టు గుడ్డా, పసుపు, కుంకుమా ఆవిడ చేతిలో ఉంచింది, భగవతి. కూతురుతో శ్రీవల్లి కాళ్ళకు దండం పెట్టించారు.

కాళ్ళకు నమస్కరించి లేచిన ఆ అమ్మాయి పెద్ద పెద్ద కళ్ళు నీటితో నిండి ఉండటాన్ని ఆశ్చర్యంగా చూసింది శ్రీవల్లి.

''మా అమ్మాయి... కమల ఎలా ఉందమ్మా...?'' ఆసక్తిగా చూస్తూ అడిగాడు భద్రయ్య

శ్రీవల్లి చిరునవ్వుతో ''అమ్మాయి కేమండీ... చక్కగా కలువపూవులా కళకళలాడుతూ ఉంది!'' మెచ్చుకుంటున్నట్లుగా అంది.

భద్రయ్య మొహం వికసించింది.

''నాకు దిగులు తీరిపోయిందమ్మా... నీ మాటతో కొండంత వూరటా కలిగింది...!'' అన్నాడు.

శ్రీవల్లి ఆశ్చర్యంగా చూసింది.

భద్రయ్య కూతురును తలమీద నిమురుతూ ''అమ్మతో నువ్విక లోపలకు వెళ్ళమ్మా. నీ కోరిక తీరుతుందిలే... దిగులు పడకు...!'' అన్నాడు

''ది...గులు... దేనికండీ...?'' శ్రీవల్లి అయోమయంగా చూసింది.

వాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళగానే... ఆయన గట్టిగా నిట్టూర్చాడు.

''ఏం చెప్పమంటావమ్మా.... పిల్లలు తీరి కూర్చుని తల్లిదండ్రుల నెత్తిమీద బండరాళ్ళు వేసినట్లు ఏవో సమస్యలు తెచ్చి పెడుతూంటారు...! మా పిల్ల కమల ఎంత అమాయకురాలో అనిపిస్తుంది చూసినవాళ్ళకు. పైకి తెలీదుగానీ ఏదయినా సమస్య వచ్చినా, దేని పట్ల అయినా ఇష్టం కలిగినా, వెంటనే తల్లిదండ్రులమైన మాకయినా

చెప్పదు! తనలో తనే తలుచుకుని బాధపడుతుంది తప్ప పెదవి విప్పదు! దాని మనస్తత్వం అది! ఆ మధ్య దిగులుగా కనిపిస్తే... కారణం తెలిసి చావక... ఆరా తీసినా లాభం లేకపోయిందిగానీ చివరకు మెల్లగా చెప్పిందమ్మా... తను మనసుపడిన అబ్బాయికి వేరేవరితోనో పెళ్ళి నిశ్చయమైపోయిందని!... అందుకు బాధపడుతోందన్నమాట! తండ్రిగా... నాకున్న స్థితిగతుల్ని బట్టి తన కోరిక ఏదైనా తీర్చగల సామర్థ్యం ఉందనుకునే వాడిని! కానీ... నా చేతుల్లో లేదని, అశక్తుడిననీ తెలిసి కుంగిపోయాను...!''

భద్రయ్య డగ్గుత్తికతో ఒక క్షణం మాట్లాడలేనట్లు మిన్నకుండి పోవటంతో శ్రీవల్లి మనసు ఆర్ద్రమైపోయింది.

''అమ్మాయి లక్షణంగా చక్కగా ఉంది. ఆ పెద్దవాళ్ళకు మీ అమ్మాయి ఇష్టం చెప్పి.... ఒప్పించే ప్రయత్నం చేయకపోయారా...? పెళ్ళయినా ఈ కాలపు పిల్లలు సరిపడకపోతే సర్దుకుపోవటం కాదు, విడిపోయే ఆలోచనా చేస్తున్నారు... నిశ్చితార్థమే కదా అయిందీ... ఏమో వాళ్ళూ మనసు మార్చుకోవచ్చుగా... ప్రయత్నం చేస్తే పోయేదేముంది?''

''ప్రయత్నం చేసానమ్మా...' ఫలించదేమోననుకున్న నా అభిప్రాయం మారింది! నీ మాటలతో కొండంత ధైర్యం వచ్చింది!... చెల్లెమ్మా... ఇంతకు ముందు మా అమ్మాయి నీ కాళ్ళకు మ్రొక్కినపుడు... తలమీద చేయి వేసి 'కల్యాణమస్తు' అని మెల్లగా దీవించటం నాకూ వినిపించింది! మంచి మనసు గలవాళ్ళమాటకు, ఆశీర్వచనానికి తిరుగుండదని నా నమ్మకం...!''

శ్రీవల్లి భద్రయ్య వైపు ఆశ్చర్యంగా చూసింది. అతనేం చెబుతున్నాడో అర్థం కాలేదు. కాకపోతే, తన మాటకు అంత శక్తి ఉందని నమ్ముతున్నందుకు కొంచెం ఆనందం మాత్రం కలిగింది! అది ఆమె వదనంలోనూ స్పష్టంగా వెల్లడైంది! కమల ఇష్టపడిరది ఎవరినీ, ఏమిటీ అని అడగాలనుకుంది. అంతలో భద్రయ్య మాటలతో ఆ విషయం స్పష్టమై ఉలిక్కి పడింది!

నిర్ఘాంతపోతూ ‘‘ఏమిటీ... మా రామాన్నా...?’’ అనడిగింది. ఆవిడ గొంతూ తడారిపోయి మాట కీచుగా వచ్చింది.

‘‘అవును చెల్లెమ్మా... అది కుదిరే పని కాదని నేను మా పిల్లకి బాగా నచ్చచెప్పాను.. అందుకనే మాతో చెప్పలేదంది. చివాట్లేసినా తన తీరు మార్చుకోనట్లు అలా దిగులుగా ఉండిపోయింది! ‘నేను నా కోరిక ఎలాగైనా తీర్చాల్సిందేనని మొండిపట్టు పట్టలేదుగా, మరి మీరెందుకూ నన్ను తప్పు పట్టటం....?’ అంటూ ఎదురు అడిగింది కూడా!

ఆస్తి అంటే... సంపాదించింది చాలానే ఉందిగానీ... మీరు... మీ కులం పిల్లతో నిశ్చయం అనుకున్నాక ఎలా అడగగలనో చెప్పమ్మా... ఆ పైన పద్మనాభం వాళ్ళు కూడా మాటల వరకే కులాల తేడా ఉండకూడదంటారు గానీ, వాస్తవంలో అంగీకరించరని అనటంతో నేనూ సాహసించలేదు!

అయితే... చెల్లెమ్మా, నువ్వు ఇందాక చెప్పిన మాటల్ని బట్టి... అందరూ అనుకునే మాట అదే... ‘తల్లి మాట జవదాటని కొడుకు...’ అనేది నిజమేనని అర్థమైంది! పద్మనాభం ఆలోచించినట్లుగా మీకు కులాల పట్టింపూ లేదని నమ్మకమూ కుదిరింది! మా అమ్మాయి ప్రేమని అర్థం చేసుకుని అంగీకరిస్తావనే ధైర్యమూ, నిరాశతో

ఆత్మహత్యకు సిద్ధపడిన నా కూతురు ప్రాణాలకు మరేం ఫరవాలేదనే భరోసా కూడా కలిగాయమ్మా! ఇక నా భారం దిగిపోయింది. మనసు తేలికైంది! మీ రామం నీ మాటని ఎలాగూ కాదనడు. ఇక మా సుబ్బయ్యా నీ ఇష్టాన్ని గట్టిగా చెబితే, ఏం చేయలేడు! అంతే కదమ్మా...! ఇక కట్న కానుకల్లో ఏ లోటూ ఉండదు! మీరెలా చెబితే, అలాగే... ఏది ఎపుడు అప్పచెప్పమంటే... సరే ననటమే తప్ప కాదనటం అంటూ ఉండదు!''

భద్రయ్య మాటలు ప్రలోభపెడుతున్నట్లుగా సాగాయి. శ్రీవల్లికి మాత్రం కలవరం కలిగించాయి... తన మాటల్ని తనకే గుర్తుచేస్తూ బంధాలేసి ఇరికించినట్లుగా ఉందనుకుంటూ తల్లడిల్లింది. గట్టిగా కాదనలేని పరిస్థితిని చేజేతులా తెచ్చుకున్నట్లనిపించింది! ఎలా కాదనాలో అర్థంకాని తికమకతో నిలబడిపోయింది!

''పదమ్మా... మీ ఇంటివరకూ నేనూ వెంటవస్తాను! అన్ని రకాలుగా ఆలోచించి... అమాయకురాలైన మా పిల్లను, తన ఆశను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించుకోమ్మా. తొందరేం లేదుగా...!'' భద్రయ్య అనటంతో శ్రీవల్లి తేరుకుని అడుగులు వేసింది.

అతని అనుచరులూ ఇద్దరు వెంట వచ్చారు. చీర అవీ పెట్టిన కవరును ఒకతని చేతిలో ఉండటం గమనించింది శ్రీవల్లి. అన్నయ్యనంటూ ఇచ్చిన వాటిని కాదనటం ఎలా అనుకుంటూ మనసులోనే నిట్టూర్చింది.

ఇంటిముందు ఆగి... అందించిన కవరును యాంత్రికంగా అందుకుని... జీవం లేని బొమ్మలా శ్రీవల్లి లోపలకు నడిచి వెళ్ళింది.

* * *

భద్రయ్య గారి ఇంటికి వెళ్ళొచ్చిన దగ్గర్నుండీ తల్లి అదో మాదిరిగా ఉండటాన్ని చూసిన రామం ''ఎందుకమ్మా... అలా ఉన్నావ్... ఏం జరిగిందీ...?'' అని పదే పదే అడుగుతోంటే శ్రీవల్లి ఒక మాట అడిగింది.

''నేనేం చేసినా, నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఏం నిర్ణయం తీసుకున్నా... నువ్వు అంగీకరిస్తావు కదూ...?'' అనడిగింది.

ఆ ప్రశ్నకి రామం విస్తుపోయినట్లుగా చూశాడు.

''అలాంటి సందేహం ఎందుకు వచ్చిందమ్మా...?'' ఎదురు ప్రశ్నించాడు.

''సమాధానం చెప్పకుండా ఎదురు ప్రశ్నలేమిటీ...? ఎందుకు, ఏమిటీ అనే ఆరాలు లేకుండా... నా మాట మన్నిస్తావా, లేదో... అది చెప్పు... చాలు...!'' అంది శ్రీవల్లి.

''తప్పకుండానమ్మా... అది నీకూ తెలుసని అనుకుంటున్నాను. నువ్వు మళ్ళీ అడిగావు కాబట్టి చెబుతున్నాను... ఎప్పుడూ కూడా నీ నిర్ణయాన్ని నేను కాదనను! సరేనా...!''

కొడుకు వైపు అభిమానంగా చూసిన శ్రీవల్లి పెదవులపైకి జీవంలేని చిరునవ్వు వచ్చింది.

పరమేశ్వరం గారింట్లో వాళ్ళంతా అందరినీ ఆదరంగా ఆహ్వానించి... మర్యాదలు చేశారు. శ్రీవల్లి ఏదో ఆలోచిస్తున్నట్లుగా ముభావంగా ఉండిపోవటం అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. మామూలుగా ఉండటానికి, మాటలు కలపటానికీ శ్రీవల్లి

ప్రయత్నించి విఫలం అయింది, ఆమె ముభావానికి కారణం ఏమై ఉంటుందా అనేదే అందరి ఆలోచనా అయింది!

భోజనాలయ్యాక కాసేపు విశ్రాంతిగా కూర్చుంటానని ఒక గదిలో ఒంటరిగా ఉండిపోయిన శ్రీవల్లి... నందూని పిలిచి పక్కన కూర్చోబెట్టుకుంది.

ఏదో చెప్పాలనుకుంటోందని గ్రహించిన నందూ ''చెప్పండి... మీరేమీ సంకోచించకండి... నేను అర్థం చేసుకుంటాను!'' అంది శ్రీవల్లితో.

శ్రీవల్లి వదనంలో ఒక విధమైన రిలీఫ్ కనుపించింది. మెల్లగా చెప్పింది.

''ఒకవేళ... ముందు అనుకున్నట్లుగా రామంతో నీ పెళ్ళి జరగకపోతే... ఏం చేస్తావమ్మా... ఆ బాధ నుండి తేలిగ్గా బయటపడగలవా...?''

ఒక క్షణం ఆ ప్రశ్నకు బిత్తరపోయిన నందూ.. మరుక్షణమే ఆశ్చర్యం నుండి తేరుకుంది.

''అంటే... మీరు మా ఇంటికి వచ్చినపుడు... అన్ని విషయాలూ ఒక కొలిక్కి వస్తాయని... అమ్మవాళ్లతో పాటూ నేనూ ఎదురుచూస్తున్న సంగతి నిజమే అయినా, మీరు కాదంటే... నేనేం క్రుంగిపోను.. కారణం ఏదో ఉండే ఉంటుందని సరిపెట్టుకుంటాను. మీ అబ్బాయి ఇష్టానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారంటేనే ఏదో కారణం బలమైనదే ఉండివుంటుంది. ఇది రామం మాటల్నిబట్టి నాకు కలిగిన అభిప్రాయమే! వివాహబంధంతో మరొకరి ఇంటికి వెళ్ళి ఆనందంగా ఉండాలంటే, రామం ఒక్కడి ఇష్టమే ముఖ్యమని నేననుకోను! అందరి ఆమోదంతో జరిగే పెళ్ళితోనే పూర్తి సంతోషం దక్కుతుంది! మనసుకీ ప్రశాంతంగా ఉంటుంది...!''

‘‘అయితే నందూ.. ఆశాభంగంతో ఆత్మహత్య లాంటి ఆలోచనలు చేయవుగా...?’’ శ్రీవల్లి ప్రశ్నకు ఆశ్చర్యంగా చూసిన నందూ ‘‘అస్సలు..’’ అంటూ తల అడ్డంగా వూపింది.

ఒక్క క్షణం స్థిమితం కలిగిన భావం ఏదో శ్రీవల్లిలో కనుపించేసరికి నందూకి ఆశ్చర్యం మరింత పెరిగింది.

‘‘నాకు అర్థంకాని విషయం ఏమిటంటే... ప్రేమలో విఫలమైతేనో, పెళ్ళి కోరుకున్న వాడితో జరగకపోతేనో... ప్రాణాలు వదిలెయ్యాలనే అభిప్రాయానికి కొందరు ఎందుకు వస్తారో మరి! జీవితంలో మనం ఎన్నో కోరుకుంటాం... ఏవేవో సాధించాలనీ అనుకుంటాం...! నెరవేరవచ్చు... కాకపోవచ్చు...! నిరుత్సాహం కలగటం సహజమే గానీ దాని వలన ప్రయోజనం ఏమీ లేదని అర్థం చేసుకుని... ఆ దుస్థితిని జయించగలగాలి... మళ్ళీ ఉత్సాహంగా మన ప్రయత్నాలు మొదలుపెట్టాలి! ఒక మార్గంలో ప్రేమ లభించకపోతే, చాలా దారుల్లో... అనేక విధాలుగా ప్రేమని పొందవచ్చు! యువతీ యువకుల మధ్య ఏర్పడే ప్రేమ ఒక్కటే జీవితంగా భావించని వాళ్ళల్లో నేనూ ఒకదాన్ని!

పెళ్ళితో మా స్నేహబంధాన్ని ఓ అనుబంధంగా మార్చుకోవాలను కున్నాం! అలా వీలుకాదని పెద్దవాళ్ళు చెబితే... ముఖ్యంగా మీరు... రామం ఇష్టానికే ప్రాధాన్యత ఇచ్చే మీరు కాదంటే... మీ అభిప్రాయాన్ని ఎందుకూ ఏమిటీ అని ప్రశ్నించకుండా గౌరవిస్తాను...! పెళ్ళి కాకపోయినా మా మధ్య ఏర్పడిన స్నేహం అలాగే ఉంటుంది. మేం మా హద్దుల్ని అతిక్రమించ కుండానే ప్రారంభించిన ప్రాజెక్టుపనీ పూర్తి చేస్తాం! ఆ తర్వాత మాత్రమే తిరిగి చదువును కొనసాగించటమా లేక ఇంకో వ్యాపారం ఏదైనానా అనే ఆలోచన చేస్తాను...!’’

స్థిరంగా చెప్పిన నందూ చేతిని అందుకుని... ఆప్యాయంగా నిమిరి ప్రశంసా పూర్వకంగా చూసింది శ్రీవల్లి.

ఎప్పుడు వచ్చాడోగానీ, గుమ్మం దగ్గరే నిలబడి వున్న రామం ''ఇందుకేనా అమ్మా... నువ్వు అదోలా, దిగులుగా ఉన్నావ్... ఈ మాట ముందుగా నాతోనో, నాన్నతోనో చెప్పకుండా లోలోన కుమిలిపోవటం దేనికమ్మా...?'' అనటంతో ఇద్దరూ ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశారు.

శ్రీవల్లి ఆశ్చర్యం నుండి తేరుకుని, తను ప్రత్యేకంగా కొడుకుకి చెప్పాల్సిన పని తప్పిందనుకుంటూ నిట్టూర్చింది. దగ్గరకు రమ్మన్నట్లు చేయి చూపింది.

రామం చటుక్కున వచ్చి ఆమె పక్కనే కూర్చుని భుజంపై తల వాల్చాడు. శ్రీవల్లికి కళ్ళనిండా కన్నీళ్ళు పొంగివచ్చాయి. క్రిందకు జారకుండా నిగ్రహించుకుంది. ఇద్దరినీ చేతులతో పొదివి పట్టుకున్నట్లుగా దగ్గరకు తీసుకుంది.

ఇక అప్పుడు మాత్రం నిగ్రహంతో ఆపిన కన్నీళ్ళు చెంపలు మీదుగా జారిపడ్డాయి!

రామం తల్లి కళ్ళు రుమాలుతో తుడిచి ''నువ్వు దేనికీ బాధపడకూడదమ్మా. నువ్వేం చెప్పినా... మేం ఆనందంగా ఆచరించే వాళ్ళమేగానీ ఎపుడూ వ్యతిరేకించం! నువ్వు నా కంటే ఎక్కువగా నా గురించి ఆలోచిస్తావు. నా ఇష్టాలు, అభిరుచులు అన్నీ తెలిసినదానివి! నీ మాటల్ని శిరసావహించటంలో నా గొప్పతనం ఏమీలేదు, నీ ప్రేమాభిమానాల పట్ల, సామర్థ్యం పట్ల నాకున్న నమ్మకం ఇది...! అంతే...!'' అన్నాడు.

శ్రీవల్లికి మళ్ళీ దుఃఖం వచ్చింది. అదుపు చేసుకోగలిగింది.

‘‘నువ్వు... నువ్వంటే... నా గురించి తెలిసిన వాడివి.... నా పెంపకంలో రూపుదిద్దుకున్నవాడివి! కానీ... నందూ కూడా నా మాటను గౌరవించటం... చాలా గొప్పగా అనిపిస్తోంది...!’’

శ్రీవల్లి మాటలకు నందూ చిరునవ్వు నవ్వింది.

‘‘అంటే... మీరు... నన్ను గొప్పగా నా తెలివి తేటల్ని మెచ్చుకుంటున్నారనిపిస్తోంది! రామం... అన్నేళ్ళ మీ పెంపకంలో మీ గురించి తెలుసుకున్నదంతా... నేను... మరి... ఈ కొద్దికాలంలోనే గ్రహించగలిగాను కదా...!’’

ఇద్దరూ నందూ వైపు అభిమానంగా చూశారు.

‘‘పదండి... ఇక్కడ మనం ముగ్గురమే కూర్చుని మాట్లాడుకుంటున్నాం. అక్కడ అందరూ ఉన్నారుగా... ఇక మేం బయలుదేరే సమయం కూడా అవుతోంది...!’’ అంటూ శ్రీవల్లి లేచి నిలబడిరది. ఏదో చెప్పాలను కుంటున్నట్లుగా సంశయంతో ‘‘మీ వాళ్ళకి.... ఏమనీ...’’ అంటూ నసిగిన శ్రీవల్లితో నందూ ‘‘మీరేం ఆ విషయం గురించి ఆందోళన పడకండి. వాళ్లకు నేను చెబుతాగా...’’ అంది.

తేలిగ్గా వూపిరి పీల్చిన శ్రీవల్లి ఒకడుగు వేయగానే నందూ ఆవిడ చేయి పట్టుకుని ఆపి ‘‘ఒక్క నిముషం శుభలేఖల్లో రాసుకోవటానికనే ఏముందీ, మీరే... నాకు నందిని, నందిత పేర్లలో ఏదో ఒకటి నిర్ణయించండి...’’ అంది.

శ్రీవల్లి నందూ తల నిమిరి ‘‘నేను నందిత అనే పేరే చెబుదామని ఎపుడో అనుకున్నాను. అయితే ఈ సందర్భంలో... నాకా అధికారం లేదని మిన్నకుండిపోయా. నువ్వడిగావుగా, అందుకే చెప్పేసా..!’’ అంది.

‘‘మీతో బంధం ఏర్పడకపోయినా, మీ పట్ల నాకున్న ప్రత్యేకమైన గౌరవం, అభిమానం అలాగే ఉంటాయి! వాటిలో మార్పు లేదు!’’ నందూ చిరునవ్వుతో చెప్పింది.

అభిమానంగా ఆవిడ చేతులనూ కళ్ళకు ఆనించుకుని తన ఇష్టాన్నీ ప్రకటించింది.